65

# దేవుడు ఎక్కడో లేడు

రంగనాయకులుకి 'కాశీయాత్ర' చేసి రావాలని ఎప్పటినుంచో ఉంది.

హెడ్మాష్టర్ ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. చాలీచాలని పెన్షన్‌తో భార్యతో బ్రతుకుబండి లాక్కువస్తున్నాడు. కూతుళ్ళకు పెళ్ళిళ్ళై వాళ్ళ కాపురాలు వాళ్ళు చేసుకుంటున్నారు. కొడుకులు పరాయి ఊళ్ళలో పెద్ద ఉద్యోగాలు చేస్తూ వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతుకుతున్నారు. తల్లిదండ్రుల సంగతి వాళ్ళకి పట్టదు. తమ దగ్గర పెట్టుకుని అలనా పాలనా చూడడం లేదు సరికదా.., సంవత్సరానికి ఓసారి కూడా ఓ పది రూపాయలు పంపరు.

ఆత్మాభిమానం గల రంగనాయకులు, లక్ష్మీదేవి- బిడ్డలైనా సరే... ఆప్యాయత, గౌరవం చూపనప్పుడు వాళ్ళ దగ్గరకు వెళ్లేవారు కాదు. 'పేద తలిదండ్రుల దగ్గరకి రావడం నామోషీ' అని- వాళ్ళూ వచ్చేవారు కాదు.

లక్ష్మీదేవి ఎప్పుడో ఇరవైయ్యేళ్ళ క్రితం- చిన్న కూతురికి ఎప్పటికీ పెళ్ళి కాకపోతుంటే... 'ఆ అమ్మాయి పెళ్ళయితే కాశీ, అన్నవరం దర్శనం చేసుకుంటా'నని మొక్కుకుంది. ఆ అమ్మాయికి పెళ్ళికావడం, పిల్లల తల్లి కావడం కూడా అయింది కాని.., కాశీయాత్ర చేయడం మాత్రం వీలుపడలేదు.

రంగనాయకులుగారు ప్రత్యేకంగా మొక్కుకోకపోయినా- ఆయనకు కాశీ విశ్వేశ్వరుడంటే అపారమైన భక్తి. అసలు తన శేషజీవితాన్ని కాశీలోనే గడిపి అక్కడే కన్ను మూయాలని అనిపిస్తుండేది.

ఈ సారి ఎలాగైనా కాశీయాత్ర చేయాలని దృఢంగా సంకల్పించుకున్నారు రంగనాయకులుగారు. భార్య ఎప్పుడూ నోరు తెరిచి తనని అడిగింది ఏదీలేదు. కనీసం ఈ యాత్ర చేస్తేనైనా ఆవిడ ఏనాడో మొక్కుకున్న మొక్కు తీర్చినట్లవుతుంది.



మొత్తంమీద ఎలాగైతేనేం.., రూపాయి రూపాయి కూడబెట్టి మూడువేలు దాచగలిగాడు ...మన.

రంగనాయకులుగారి పొరుగింట ఉంటాడు ఫణిభూషణం గారు.

ఆయన మరీ డబ్బున్నవాడేం కాదుకాని.., డబ్బుకి ఇబ్బందిలేని పైవర్గపు మధ్యతరగతి వాడు. మనిషి వట్టి దురాశాపరుడు. ఉన్న డబ్బు అంతా పేదసాదలకి అప్పులు ఇచ్చి , కాబూలీ వడ్డీలు వసూలు చేసేవాడు. తన అవసరాలకి బొటాబొటిగా ఖర్చు పెట్టుకునేవాడు. ఇదికాక - నోరూవాయీ లేని రంగనాయకులుగారి స్థలాన్ని కాజేయాలని ప్రయత్నం చేసేవాడు.

రెండిళ్ళ మధ్య గోడ లేకపోవడంతో... నెమ్మదినెమ్మదిగా ఆయన స్థలాన్ని చాపక్రింది నీరులాగా ఆక్రమించుకోసాగారు.

ఈ విషయం తెలిసీ, ఏమీ చేయలేక... దేవుడే అతనికి గుణపాఠం నేర్పుతాడని సరిపెట్టుకునేవాడు రంగనాయకులుగారు.

ఆరోజు ఆదివారం. ఉన్నట్లుండి ఫణిభూషణరావుకి గుండెజబ్బు వచ్చింది.

ఆస్పత్రికి తీసుకువెళ్తే 'వెంటనే ఆపరేషన్ చేయాలనీ, లేకుంటే ప్రాణానికి ముప్పు' అని చెప్పారు. 'అర్జంటుగా ఐదువేలు డిపాజిట్ చేస్తే చికిత్స మొదలుపెట్తా' మన్నారు.

ఫణిభూషణరావు ఇంట్లో డబ్బు ఉంచుకునేవాడు కాదు. ఇంట్లో వుంటే దొంగలు పడ్తారని భయం. పైగా... బయట తిప్పితే వడ్డీ వస్తుందాయె!

ఆరోజు బ్యాంకు కూడా ఉండదు. ఇప్పుడు ఎక్కడ నుంచి ఐదువేలు తేవడం..?

ఫణిభూషణరావంటే అసహ్యంతో ఎవ్వరూ అడిగినా ఇయ్యలేదు. నాలుగుచోట్ల తిరిగి తెచ్చే వ్యవధి లేదు. గిసి గిసి చూస్తే ఇంట్లో రెండువేలు దొరికింది. మిగిలిన మూడువేలు ఎక్కడినుంచి వస్తుంది?

పొరుగింట్లోనేవున్న రంగనాయకులుగారికి ఫణిభూషణరావుగారింట్లో వారి మాటలు వినిపిస్తున్నాయి. వారి పరిస్థితీ, ఆందోళన అర్థమయ్యాయి.

"లక్ష్మీ... పొరుగు మనిషి చావుబ్రతుకుల్లో ఉన్నాడు. మనం దాచుకున్న డబ్బు ఇచ్చేద్దాం" అన్నాడు.

'ఫణిభూషణరావు మనల్ని చాలా బాధపెట్టున్నవాడు. అటువంటివాడికి సహాయం చేయాలా?! చేసినా దురాశపరుడైన అతడు తిరిగి తమ డబ్బు ఇచ్చేస్తాడా..?' అని అనిపించింది ఆమెకి. కానీ.., పైకి ఏమీ అనక "మీ ఇష్టం. మీకు తోచిన విధంగా చేయండి" అంది.

వెంటనే రంగనాయకులు తాము దాచుకున్న డబ్బు తీసుకుని ఫణిభూషణరావు ఇంటికి వెళ్లాడు. సకాలంలో సాయం అందడంతో త్వరలోనే గండం గడిచి బయటపడ్డాడు.

ఫణిభూషణరావు భార్య రంగనాయకులుగారు చేసిన సహాయం చెప్పి, ఆయన బాకీ తీర్చేయమంది.

కానీ, 'పాముకి పోసిన పాలు విషమైనట్లు' అతను- "ఇద్దాంలే! ఈ మూడువేలు బయట తిరిగితే బోలెడు వడ్డీ వస్తుంది. పైవడ్డీతో ఆయన బాకీ తీరుద్దాం. ముందు నా ప్రాణం రక్షించి నందుకు తిరుపతి వెంకన్ననీ, కాశీ విశ్వేశ్వరుడినీ దర్శించుకోవాలి. రంగనాయకులి బాకీ సంగతి ఆ తర్వాత చూద్దాం" అన్నాడు.

భర్త సంగతి తెలిసిన ఆమె మరేమీ మాట్లాడలేదు.

ఫణిభూషణరావు భార్యా సమేతంగా తీర్థయాత్రలకి బయలుదేరాడు.

ముందు తిరుమల జేరుకున్నాడు. దైవదర్శనం చేసుకుంటుంటే అతనికి శ్రీవెంకటేశ్వరుని స్థానంలో రంగనాయకుల రూపం కనిపించింది. కాళహస్తిలోనూ అంతే.., కాశీలోనూ అంతే..! ఏ క్షేత్రానికి వెళ్లినా దైవం స్థానంలో రంగనాయకులు రూపం కనబడసాగింది.

అప్పుడు జ్ఞానోదయమైంది ఫణిభూషణరావుకి. 'ఆపదలో ఆదుకున్నవాడే అసలైన దేవుడు. నన్ను కాపాడిన నిజమైన దైవం రంగనాయకులు. అటువంటి దైవానికి ఎగ్గు తలపెట్టాను నేను. ముందు ఆ ప్రత్యక్ష దైవాన్ని దర్శనం చేసుకోవాలి' అనుకుని తిరుగుప్రయాణం మొదలుపెట్టాడు.

రంగనాయకులుగారి దగ్గరకు వెళ్లి పాదాల మీదపడి కన్నీళ్ళతో అభిషేకించాడు. ఆనాటి నుంచి పేదసాదలకు సహాయ పడుతూ నలుగురికీ ప్రయోజనం కల్పించే జీవితం ప్రారంభించాడు ఫణిభూషణరావు.

★★★

